https://epaper.manasamajam.com Contact No. 9989788438, 9505285656

# మన సమాజం

తెలుగు డిజిటల్ దిన పత్రిక

Truth towards the Society

చైర్మెన్ : పార్వతి సురేష్ కుమార్ ఎడిటర్ : పార్వతి రాజేష్ కుమార్

సంపుటి : 01 సంచిక : 363 మంగళవారం 14-4-2026 పేజీలు : 4

రిపోర్టర్స్ కావలెను

మన సమాజం

Truth towards the Society

మన సమాజం తెలుగు డిజిటల్ దినపత్రికలో

నిఖార్సైన జర్నలిస్టుగా నిలబడాలనుకుంటున్నారా?

అన్ని తరహా వార్తలు, కథనాలు ఎలాంటి ఆంక్షలు లేకుండా

రాయాలని కోరుకుంటున్నారా?

తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, మండలాలల్లో

పనిచేసేందుకు విలేఖరులు కావలెను...

మీ కలాలకు పదును పెట్టండి.

సంప్రదించవలసిన నెంబర్లు

9989788438, 9505485656.

# జీడీపీకి సగం సీట్లు

## మిగిలిన సగం సీట్లను ప్రోరేటాలో అన్ని రాష్ట్రాలకు కేటాయించాలి




- 50 శాతం సీట్ల పెంపు ప్రతిపాదనతో ఉత్తరాది, దక్షిణాది మధ్య భారీ అంతరం
- పంజాబ్ వంటి రాష్ట్రాలకూ అన్యాయం
- బిల్లును ఎలా ఆమోదిస్తారో చూస్తాం
- మహిళా బిల్లుకు కాంగ్రెస్ వ్యతిరేకం కాదు
- డీలిమిటేషన్‌ను కలపడం రాజకీయ కుట్ర
- 2026 జనాభా నిబంధనను తొలగించాలి
- అఖిలపక్షంతో చర్చించాలి : సీఎం రేవంత్

**హైదరాబాద్, ఏప్రిల్ 13**

డీలిమిటేషన్‌లో భాగంగా మోదీ సర్కారు పెంచాలనుకుంటున్న ఎంపీ సీట్ల విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి సరికొత్త ప్రతిపాదన చేశారు. రాష్ట్రాల వారీగా 50 శాతం చొప్పున పెరిగే మొత్తం 272 ఎంపీ సీట్లలో సగం సీట్లను జీఎ?సడీపీలో మెరిట్ సాధించిన రాష్ట్రాలకు కేటాయించాలన్నారు. మిగిలిన సగం సీట్ల మేరకు ప్రోరేటా ప్రకారం అన్ని రాష్ట్రాల్లో సీట్ల సంఖ్యను పెంచాలని సూచించారు. ఈ మేరకు తాను హైబ్రిడ్ ప్రతిపాదనను కేంద్రం ముందు ఉంచుతున్నట్లు చెప్పారు. ఇలా చేస్తే దేశానికి ఆదాయాన్ని తెచ్చిపెడుతున్న రాష్ట్రాలను గౌరవించినట్లు అవుతుందన్నారు. మహిళా రిజర్వేషన్ల బిల్లుకు కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకం కాదన్నారు. అయితే ఈ నెల 16 నుంచి జరిగే పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో ప్రవేశపెడుతున్న మహిళా బిల్లులో నియోజకవర్గాల పునర్విభజననూ కలపడం రాజకీయ కుట్ర అని ఆరోపించారు. మహిళా రిజర్వేషన్ చట్టంలో '2026 జనాభా లెక్కల ప్రకారం' అనే నిబంధనను తొలగిస్తే.. ఉన్న సీట్ల ప్రకారం తక్షణమే మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమల్లోకి వస్తుందన్నారు. 2029లో లోక్‌సభ ఎన్నికలతోపాటు వివిధ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో మహిళా రిజర్వేషన్లను అమలు చేయవచ్చునన్నారు. ప్రస్తుతం ఉన్న లోక్‌సభ, అసెంబ్లీ సీట్ల ప్రాతిపదికన మహిళా రిజర్వేన్ సవరణ బిల్లును తీసుకువస్తే కాంగ్రెస్ పార్టీ సంపూర్ణంగా మద్దతిస్తుందని స్పష్టం చేశారు. సోమవారం సచివాలయంలో డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, పలువురు మంత్రులు, ఎంపీలతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడారు. మోదీ ప్రభుత్వం వ్యూహాత్మకంగానే మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లును, డీలిమిటేషన్‌ను ఒకటిగా చూపిస్తోందని, మహిళా బిల్లుకు ప్రతిపక్షాలు సహకరించడంలేదంటూ ప్రచారం చేస్తోందని తెలిపారు.

**మహిళలకు ఓటుహక్కు కల్పించింది కాంగ్రెస్సే**

దేశంలో పురుషులతో సమానంగా మహిళలకు ఓటు హక్కు కల్పించింది కాంగ్రెస్ పార్టీయేనని సీఎం రేవంత్ అన్నారు. అప్పటికి ప్రపంచంలోని చాలాదేశాల్లో మహిళలకు ఓటు హక్కు లేదని చెప్పారు. దేశ ప్రధానిగా, రాష్ట్రపతిగా, లోక్‌సభ స్పీకర్‌గా, ముఖ్యమంత్రులుగా, గవర్నర్లుగా ఎన్నో రాజ్యాంగ బద్ధమైన పదవుల్లో మహిళలకు కాంగ్రెస్ పార్టీ అవకాశం కల్పించిందన్నారు. మహిళలైన ఇందిర, సోనియాల నాయకత్వంలో పనిచేసిన పార్టీ అన్నారు. స్థానిక సంస్థల్లో మహిళలకు రిజర్వేషన్ కల్పించిందీ.. కాంగ్రెస్సేనన్నారు. చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ బిల్లును కూడా సోనియాగాంధీ నాయకత్వంలో పార్లమెంటులో 2013లో ప్రవేశపెట్టిందీ కాంగ్రెస్ ప్రభుత్వమేనన్నారు.

## కేసీఆర్‌కు మంత్రి సీతక్క

# లీగల్ నోటీసు

**బీఆర్ఎస్ సోషల్‌మీడియా ఖాతాల్లో నాపై దుష్ప్రచారం**

**ఆ పోస్టులను 48 గంటల్లోగా తొలగించి.. క్షమాపణ చెప్పాలి**

**లేదంటే న్యాయపరంగా చర్యలు తీసుకుంటాం: మంత్రి సీతక్క**





**హైదరాబాద్, ఏప్రిల్ 13**

అంగన్‌వాడీలకు సెల్ ఫోన్ల కొనుగోలు విషయమై బీఆర్ఎస్ అధికారిక సోషల్ మీడియా ఖాతాల్లో చేస్తున్న దుష్ప్రచారానికి బాధ్యుడిగా పేర్కొంటూ ఆ పార్టీ అధినేత కేసీఆర్‌కు మంత్రి సీతక్క లీగల్ నోటీసు పంపించారు. 48 గంటల్లోగా సోషల్ మీడియా ఖాతాల్లోని సదరు పోస్టులను తొలగించి, బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ విషయమై ప్రజా భవన్‌లో సోమవారం మంత్రి సీతక్క మీడియాతో మాట్లాడుతూ అంగన్‌వాడీలకు ఫోన్ల కొనుగోలు విషయమై వ్యక్తిగతంగా ఎవరైనా ఆరోపణలు చేస్తే పట్టించుకోవాల్సిన అవసరం లేదని, కానీ అవాస్తవాలను పార్టీ అధికారిక ఖాతాల్లో ప్రచారం చేయడం వల్లే కేసీఆర్‌కు లీగల్ నోటీసులు ఇచ్చామని పేర్కొన్నారు. రూ.44కోట్ల టెండర్‌లో రూ.30కోట్ల అవినీతి జరిగిందని చెప్పడం హాస్యాస్పదమని, తప్పును పది సార్లు చెబితే నిజం కాదని అన్నారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో కేటీఆర్‌కు గట్టిగా సమాధానాలు ఇచ్చానన్న కక్షతోనే తనపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఒక్కో ఫోన్ ను రూ.11,650కే కొనుగోలు చేశామని, ఇతర రాష్ట్రాల కంటే తక్కువ ధరకు టీజీటీఎస్ ద్వారా కొనుగోలు చేసినట్టు వివరించారు. ఇప్పటికైనా బీఆర్ఎస్ సోషల్ మీడియా ఖాతాల్లోని పోస్టులను తొలగించి, క్షమాపణ చెప్పకుంటే, తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కాగా, స్మార్ట్‌ఫోన్ల కుంభకోణంపై తాము అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా.. కేసీఆర్‌కు మంత్రి సీతక్క లీగల్ నోటీసు ఎలా పంపుతారని బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్లు మన్నెక్రిశాంక్, సతీష్ రెడ్డి, దినేష్ చౌదరి ప్రశ్నించారు.

# గనుల రంగంలో సంస్కరణల అమలు

**పారదర్శకంగా వేలం విధానం తీసుకొచ్చాం**

**క్రిటికల్ మినరల్ బ్లాక్స్ వేలంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి**



**హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 13**

గనుల రంగంలో అనేక సంస్కరణలను అమలు చేస్తున్నామని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. 2014లో బొగ్గు గనులపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు తర్వాత నామినేషన్ పద్ధతికి ముగింపు పలికి, పూర్తిగా పారదర్శకమైన వేలం విధానాన్ని తీసుకువ చ్చామని గుర్తు చేశారు. హైటెక్స్‌లో సోమవారం నిర్వహించిన క్రిటికల్ మినరల్ బ్లాక్స్ 7వ విడత వేలంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ గనుల రంగంలో ప్రైవేటు, ప్రభుత్వ సంస్థలకు సమాన అవకాశాలు కల్పిస్తూ పోటీ వాతావరణాన్ని సృష్టించేలా ప్రధాని మోదీ చర్యలు తీసుకున్నారని తెలిపారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా క్రిటికల్ మినరల్స్‌కు డిమాండ్ పెరిగిందని, అందుకే పలు దేశాలతో భారత్ ఒప్పందాలు కుదుర్చుకుందన్నారు. 'క్రిటికల్ మినరల్ మిషన్' పేరుతో రూ.32వేల కోట్లు వెచ్చించి విదేశాల్లో ఉన్న క్రిటికల్ మినరల్స్‌ను భారత్‌కు తీసుకువస్తున్నామన్నారు. దేశంలో క్రిటికల్ మినరల్స్ వనరులు పరిమితంగానే ఉన్నా.. మోదీ ప్రభుత్వం గరిష్ఠంగా వినియోగించేందుకు చర్యలు తీసుకుంటుందన్నారు. అర్బన్ మైనింగ్‌పై దృష్టి సారించడంతోపాటు, ఎలక్ట్రానిక్, ఎలక్ట్రికల్ ఉపకరణాల స్క్రాప్ నుంచి క్రిటికల్ మినరల్స్‌ను రీసైక్లింగ్ చేస్తున్నామన్నారు. అర్బన్ మైనింగ్ ద్వారా దేశానికి అవసరమైన క్రిటికల్ మినరల్స్‌లో 30-40 శాతం తిరిగి పొందే అవకాశముందన్నారు. దేశంలో బొగ్గు ఉత్పత్తి రికార్డు స్థాయికి చేరిందని, వరుసగా రెండేళ్లుగా బిలియన్ టన్నుల ఉత్పత్తి చేరుకున్నామన్నారు. డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ అంశాలపై కొందరు అపోహలు సృష్టిస్తున్నారని కిషన్‌రెడ్డి విమర్శించారు. ఈ విషయాల్లో సీఎం రేవంత్ కూడా అవగాహన లోపంతో మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. మహిళా రిజర్వేషన్ బిల్లు దేశంలోని మహిళల గౌరవాన్ని పెంచే చారిత్రక నిర్ణయమని, దాన్ని రాజకీయంగా చూడకూడదని హితవు పలికారు. ఇక, డీలిమిటేషన్ కారణంగా దక్షిణాదికి అన్యాయం జరుగుతుందనడం సరికాదన్నారు.

# మీతో న్యాయం కష్టమే.. నాకు నమ్మకం లేదు!



**ట్రయల్‌కోర్టు 3 నెలలు విచారించి, తప్పుడు కేసని తేల్చింది**

**సీబీఐ సవాల్ చేయగానే మీరు ఆ తీర్పును పక్కనపెట్టారు**

**మీ వల్ల న్యాయం జరుగుతుందన్న ఆశ లేదు.. విచారణ నుంచి తప్పుకోండి**

**ఢిల్లీ మద్యం కేసులో జస్టిస్ స్వర్ణకాంతశర్మ ఎదుట ఆప్ అధినేత కేజ్రీవాల్ వాదనలు**

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 13:**

'మద్యం పాలసీ కేసుపై మీరు విచారణ జరిపితే నాకు న్యాయం జరుగుతుందన్న నమ్మకం లేదు' అని ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ స్వర్ణకాంత శర్మకు ఢిల్లీ మాజీ సీఎం, ఆమ్‌ఆద్మీపార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ తెలియజేశారు. గతంలో ఇదే కేసులో విచారణ సందర్భంగా.. తనను దాదాపుగా నేరస్థుడిగా జస్టిస్ స్వర్ణకాంత ప్రకటించిన విషయాన్ని కేజ్రీవాల్ గుర్తు చేశారు. కేవలం మూడుసార్లు జరిగిన విచారణలతోనే ఈ కేసులో తనతో పాటు ఉన్న నిందితులందరినీ మహా అవినీతి పరులుగా ఆమె అభివర్ణించిన సంగతిని ప్రస్తావించారు. ఈ కేసు విచారణ నుంచి జస్టిస్ స్వర్ణకాంత తప్పుకోవాలని (రెక్యూజల్) తాను దాఖలు చేసిన పిటిషన్ మీద కేజ్రీవాల్ సోమవారం స్వయంగా వాదనలు వినిపించారు. 'రెక్యూజల్ చట్టం ప్రకారం జడ్జి సరైన వ్యక్తా? కాదా? అన్నది కాదు.. జడ్జి పట్ల కక్షిదారులో ఉండే అపనమ్మకమే ప్రధానం. మీ ముందున్న కేసుల్లో.. ఈ కేసు, బీజేపీ ప్రత్యర్థి అయిన మరో వ్యక్తి మీద ఉన్న కేసు మాత్రమే చాలా వేగంగా ముందుకు కదులుతున్నాయి. మిగిలిన వాటిలో ఆ వేగం లేదు. అదీగాక, ఈ రెండు కేసుల్లో దర్యాప్తు సంస్థల వాదనలతో మీరు దాదాపుగా ఏకీభవిస్తున్నారు. మద్యం విధానం కేసులో 3నెలలపాటు రోజువారీగా విచారణ జరిపి నాతోపాటు నిందితులందర్నీ నిర్దోషులుగా ప్రకటించిన ట్రయల్ కోర్టు తీర్పును సీబీఐ హైకోర్టులో సవాల్ చేయగానే.. విచారణ ప్రారంభమైన తొలిరోజునే (మార్చి 9న) మీరు దాదాపుగా కొట్టివేశారు. ఈ సందర్భంగా.. మీరు చేసిన వ్యాఖ్యలు సహజ న్యాయ సూత్రాలకు పూర్తి విరుద్ధమైనవి' అని కేజ్రీవాల్ ప్రశ్నించారు. తనతోపాటు ఈ కేసులో నిందితులుగా ఉన్న పలువురి బెయిల్ పిటిషన్లపై గతంలో విచారణ సందర్భంగా.. తమను అవినీతిపరులుగా పేర్కొంటూ జస్టిస్ స్వర్ణకాంత వ్యక్తం చేసిన అభిప్రాయాలను కేజ్రీవాల్ గుర్తు చేశారు. కాగా, ఆర్ఎస్ఎస్ విద్యార్థి విభాగమైన ఏబీవీపీ గతంలో ఏర్పాటు చేసిన నాలుగు సమావేశాలకు జస్టిస్ స్వర్ణ కాంత శర్మ హాజరైన విషయాన్ని ప్రస్తావించారు. ఆర్ఎస్ఎస్, బీజేపీలను బహిరంగంగా వ్యతిరేకించే తనకు.. ఆ సంస్థల భావజాలంతో ప్రభావితమైన న్యాయమూర్తి నుంచి న్యాయం లభించదన్న సంశయం నెలకొందని చెప్పారు. కాగా, కేజ్రీవాల్ వాదనలను తప్పుబడుతూ సీబీఐ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. జడ్జీలు పక్షపాతంగా ఉన్నారని, విచారణ నుంచి తప్పుకోవాలని కేసులు వేసుకుంటూ వెళ్తే.. ఏ జడ్జి అయినా కేసుల విచారణ చేపట్టగలరా? అని ప్రశ్నించారు.

# రేపటి నుంచి దోస్త్ రిజిస్ట్రేషన్ ప్రారంభం

**మూడు విడతల్లో డిగ్రీ సీట్ల భర్తీ**

**జూలై 1 నుంచి తరగతులు**

**రాష్ట్రవ్యాప్తంగా 969 కాలేజీల్లో 4.4 లక్షల సీట్లు**



**హైదరాబాద్, ఏప్రిల్ 13**

రాష్ట్రంలో ఇంటర్ ఫలితాలు వెలువడిన నేపథ్యంలో డిగ్రీ కాలేజీల్లో ప్రవేశాల ప్రక్రియ మొదలైంది. ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో ప్రవేశాలకు ఉద్దేశించిన దోస్త్ (డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ) షెడ్యూల్ వెలువడింది. సోమవారం ఉన్నత విద్యామండలి కార్యాలయంలో మండలి అధ్యక్షుడు, దోస్త్ కన్వీనర్ ఆచార్య బాలకిష్టారెడ్డి, మండలి ఉపాధ్యక్షులు పురుషోత్తం, ఎస్కే.మహమూద్, కార్యదర్శి శ్రీరాం వెంకటేష్ షెడ్యూల్‌ను విడుదల చేశారు. దరఖాస్తుల స్వీకరణ మూడు విడతల్లో జరగనుంది.

# టీఎంసీకి 226 సీట్లు ఖాయం: మమత

**సూరీ, ఏప్రిల్ 13:**



పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో 294 స్థానాలకు గాను తన పార్టీ 226 సీట్లలో విజయం సాధిస్తుందని టీఎంసీ నాయకురాలు, సీఎం మమతా బెనర్జీ అన్నారు. ఢిల్లీ నుంచి తరలించిన బలగాలను ఉపయోగించి బీజేపీ గెలువజాలదని స్పష్టంచేశారు. తనను ఢీకొనేందుకు కేంద్రప్రభుత్వం, 19 ఎన్‌డీఏ పాలిత రాష్ట్రాలు ఏకమయ్యాయని చెప్పారు. అయినప్పటికీ సామాన్య ప్రజల కోసం ఒంటిచేత్తో పోరాడుతున్నానని తెలిపారు. సోమవారం బీర్‌భూమ్ జిల్లా సూరీలో జరిగిన ఎన్నికల సభలో ఆమె ప్రసంగించారు. బీజేపీ డబ్బు పంపిణీ చేస్తోందని.. అధికారులను, పోలీసులను ఇతర రాష్ట్రాలకు బదిలీ చేస్తోందని ధ్వజమెత్తారు. డబ్బు, డ్రగ్స్, ఆయుధాలు, ఓటర్లను బెంగాల్లోకి అక్రమ రవాణా చేస్తున్నారని.. ముఖ్యంగా బిహార్ నుంచి రైళ్లు, బస్సుల్లో జనాలను దించుతున్నారని ఆరోపించారు. బీజేపీ గెలిస్తే బెంగాల్లో యువతకు ఉపాధి కల్పిస్తామన్న మోదీ హామీపై మండిపడ్డారు. తాను ప్రధానిని అయితే ఏటా 2 కోట్ల ఉద్యోగాలిస్తానని గతంలో ఆయన చేసిన వాగ్దానం ఏమైందని నిలదీశారు. బెంగాల్లో ఈ నెల 23, 29 తేదీల్లో రెండు విడతలుగా పోలింగ్ జరగనున్న సంగతి తెలిసిందే.

# ఏ పార్టీతోనూ పొత్తులుండవు

**రాష్ట్రంలో ఒంటరిగానే అధికారంలోకి వస్తాం**

**రాబోయేది డబుల్ ఇంజన్ సర్కారే**

**50 ఏళ్లకు పైగా దేశాన్ని ఏలిన కాంగ్రెస్..**

**మహిళా బిల్లును ఎందుకు అమలు చేయలేదు?**

**ఖానాపూర్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు**

**ఖానాపూర్, ఏప్రిల్ 13**

తెలంగాణలో రాబోయేది డబుల్ ఇంజన్ సర్కారేనని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు చెప్పారు. భవిష్యత్తులో బీజేపీకి ఏ పార్టీతోనూ పొత్తులు ఉండవన్నారు. తాము సొంతంగానే అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు. సోమవారం నిర్మల్ జిల్లా ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్‌గా అంకం మౌనిక బాధ్యతల స్వీకరించారు. ఈ కార్యక్రమానికి రాంచందర్‌రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 50 ఏళ్ల పాటు దేశాన్ని, రాష్ట్రాన్ని ఏలిన కాంగ్రెస్ పార్టీ మహిళా బిల్లును ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. 400 మంది ఎంపీల బలమున్న సమయంలో సైతం రాజీవ్ గాంధీ మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టలేకపోయారన్నారు.

బిల్లును ప్రవేశపెట్టకపోగా ఒక వర్గం మహిళల కోసం చట్టాన్నే మార్చారని ఆరోపించారు. అదే వర్గం మహిళలకు అండగా నిలిచేందుకు ప్రధాని మోదీ ట్రిపుల్ తలాక్‌ను రద్దు చేశారని గుర్తు చేశారు. తలసరి ఆదాయాన్ని బట్టి సీట్లు కేటాయించాలని రేవంత్‌రెడ్డి చెబుతున్న మాటలు అర్థం లేనివన్నారు. రేవంత్‌రెడ్డిది నియంతృత్వ ధోరణి అని, పేదవాడు పేదవాడిగానే ఉండేలా ఆలోచన చేస్తున్నారని ధ్వజమెత్తారు. సబ్ కా సాత్.. సబ్ కా వికాస్ అన్నది బీజేపీ విధానమని.. ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల్లో అది నిరూపితమైందని చెప్పారు. వైస్ చైర్మన్ పదవిని ఎవరికి ఇచ్చామో చూడాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, మజ్లిస్ వేర్వేరు కాదన్న విషయం మున్సిపల్ ఎన్నికల్లో మరోసారి నిరూపితమైందని రాంచందర్‌రావు అన్నారు. రాష్ట్రంలో కొత్త పార్టీలను ప్రజలు ఆదరించే పరిస్థితి లేదన్నారు. తెలంగాణలో కాంగట?స్రకు ప్రత్యామ్నాయం బీజేపీనే అని.. రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు.



# టీజీటెట్-2026 నోటిఫికేషన్ విడుదల

**- జూన్ 15 నుంచి పరీక్షలు - ఏప్రిల్ 15 నుంచి దరఖాస్తులు - సీబీటీ విధానంలో నిర్వహణ**

**హైదరాబాద్, ఏప్రిల్ 13**

తెలంగాణలో ఉపాధ్యాయ వృత్తిని ఆశిస్తున్న అభ్యర్థులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. టీజీటెట్-జూన్ 2026 నోటిఫికేషన్‌ను పాఠశాల విద్యాశాఖ విడుదల చేసింది. ఈ పరీక్షలను జూన్ 15 నుంచి జూన్ 30 వరకు కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ) విధానంలో నిర్వహించనున్నట్లు ప్రకటించింది. అర్హులైన అభ్యర్థులు ఏప్రిల్ 15 నుంచి ఏప్రిల్ 30 వరకు అధికారిక వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు సమర్పించుకోవాలని అధికారులు తెలిపారు. టీజీటెట్ ఛైర్‌పర్సన్ డాక్టర్ ఇ. నవీన్ నికోలస్ ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. విద్యా హక్కు చట్టం-2009 ప్రకారం ఉపాధ్యాయ నియామకాలకు టెట్ అర్హత తప్పనిసరి కావడంతో ఈ పరీక్షకు ప్రాధాన్యం పెరిగింది. డీఈడీ/ డీఎల్ఎడ్, బీఈడీ, లాంగ్వేజ్ పండిట్ లేదా సమాన కోర్సులు పూర్తి చేసిన వారు, అలాగే చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. గతంలో టెట్ అర్హత సాధించిన వారు తమ స్కోర్ మెరుగుపరచుకునేందుకు మళ్లీ పరీక్ష రాయవచ్చు. పరీక్షను రెండు పేపర్లుగా నిర్వహిస్తారు. 1 నుంచి 5వ తరగతి బోధన కోసం పేపర్-×, 6 నుంచి 8వ తరగతులకు పేపర్-×× నిర్వహిస్తారు. రెండు స్థాయిలకు బోధించాలనుకునే వారు రెండు పేపర్లకు హాజరుకావచ్చు. ఫీజులు జనరల్, బీసీ అభ్యర్థులకు ఒక పేపర్‌కు రూ.750, రెండు పేపర్లకు రూ.1000గా నిర్ణయించారు. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు ఒక పేపర్‌కు రూ.700, రెండు పేపర్లకు రూ.950గా ఫీజు ఖరారు చేశారు. పరీక్షలకు సంబంధించిన ముఖ్యమైన తేదీలను కూడా విద్యాశాఖ ప్రకటించింది. ఏప్రిల్ 15 నుంచి దరఖాస్తులు, జూన్ 9 నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్, జూన్ 15 నుంచి పరీక్షలు నిర్వహించనున్నారు. ఫలితాలు జూలై 28 నుంచి 31 మధ్య విడుదల కానున్నాయి. అభ్యర్థులు దరఖాస్తు సమయంలో తమకు అనుకూలమైన పరీక్షా కేంద్రాలను ఎంపిక చేసుకునే అవకాశం ఉంటుంది. మరిన్ని వివరాల కోసం అధికారిక వెబ్‌సైట్ లేదా హెల్ప్‌లైన్ నంబర్లను సంప్రదించాలని అధికారులు సూచించారు.

# చర్లపల్లి ఘటనలో సంచలన మలుపు

**- ఆస్తి వివాదమే కారణమా? - అత్తమామలపై భర్త ఆరోపణలు - పోలీసుల దర్యాప్తు వేగవంతం**





**హైదరాబాద్, ఏప్రిల్ 13**

హైదరాబాద్ శివారు చర్లపల్లిలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ విజయశాంతి రెడ్డి తన ఇద్దరు పిల్లలతో కలిసి ఆత్మహత్య చేసుకున్న ఘటనలో కొత్త కోణాలు వెలుగులోకి వచ్చాయి. ఆస్తి వివాదం కారణంగానే ఈ దారుణం జరిగిందని భర్త సురేందర్ రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు కీలక మలుపు తిరిగింది. ఈ ఏడాది జనవరి 31న విజయశాంతి రెడ్డి (38), ఆమె కుమార్తె చైతన్య రెడ్డి (18), కుమారుడు విశాల్ రెడ్డి (17) చర్లపల్లి-ఘట్‌కేసర్ మధ్య గూడ్స్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం రేపింది. తాజాగా మేడిపల్లి పోలీసులను ఆశ్రయించిన సురేందర్ రెడ్డి తన అత్త పుష్పలత, బామ్మర్ది చిరంజీవి, అతని భార్యపై తీవ్ర ఆరోపణలు చేశారు. ఆస్తి కోసం వారే తన భార్యను మానసికంగా వేధించారని, అదే ఆమెను ఈ దారుణ నిర్ణయం తీసుకునేలా చేసిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. "నా భార్య, పిల్లలు పిరికివాళ్లు కాదు. సొంతవాళ్లే మోసం చేసి ఈ పరిస్థితికి తెచ్చారు" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. భార్యాపిల్లలు చనిపోయిన తర్వాత కూడా ఆస్తి కోసం తనను బెదిరిస్తున్నారని సురేందర్ రెడ్డి ఆరోపించారు. ఇంట్లో ఉన్న సుమారు కేజీన్నర బంగారం, రూ.1.40 కోట్ల నగదును అత్త గుట్టుచప్పుడు కాకుండా తీసుకెళ్లిందని పేర్కొన్నారు. ప్రస్తుతం తన ప్రాణాలకు ముప్పు ఉందని, తనను కూడా లక్ష్యంగా చేసుకున్నారని ఆయన భయాందోళన వ్యక్తం చేశారు. తాను ఏదైనా ప్రమాదానికి గురైతే ఆస్తి మొత్తం తన తల్లిదండ్రులకు లేదా ట్రస్టుకు చెందేలా వీలునామా రాస్తానని స్పష్టం చేశారు. తన కుటుంబాన్ని నాశనం చేసిన వారికి ఒక్క రూపాయి కూడా దక్కనివ్వనని తెలిపారు. విజయశాంతి హైటెక్ సిటీలో టీమ్ లీడర్‌గా పనిచేస్తుండగా, సురేందర్ రెడ్డి దుబాయ్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. ఘటనకు ముందు రోజు పిల్లలను హాస్టల్ నుంచి ఇంటికి తీసుకొచ్చిన విజయశాంతి, అర్ధరాత్రి కారులో చర్లపల్లి రైల్వే స్టేషన్‌కు వెళ్లినట్లు సీసీ కెమెరాల్లో రికార్డైంది. భర్త ఫిర్యాదు నేపథ్యంలో పోలీసులు ఆస్తి వివాదం కోణంలో కేసును పునఃపరిశీలిస్తూ దర్యాప్తును ముమ్మరం చేశారు. ఈ కేసులో మరిన్ని సంచలన అంశాలు వెలుగులోకి వచ్చే అవకాశముందని భావిస్తున్నారు.

# హాజీపూర్‌లో 'అరైవ్ అలైవ్' కార్యక్రమం

**- రహదారి భద్రతపై అవగాహన - నిబంధనలు పాటించాలని అధికారుల పిలుపు**







**మంచిర్యాల,ఏప్రిల్ 13,(మన సమాజం ):**

మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం రాపల్లి గ్రామంలో రహదారి భద్రతపై అవగాహన కల్పించేందుకు 'అరైవ్ అలైవ్' కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్, ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు తదితరులు హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, వాహనదారులు రహదారి భద్రతా నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. జాగ్రత్తగా వాహనం నడిపి సురక్షితంగా గమ్యానికి చేరుకోవాలని, రోడ్డు ప్రమాదం ఒక కుటుంబానికి తీవ్ర నష్టం కలిగిస్తుందని అన్నారు. మద్యం సేవించి లేదా మొబైల్ వినియోగిస్తూ వాహనం నడపకూడదని హెచ్చరించారు. 18 సంవత్సరాల లోపు వారు వాహనాలు నడపరాదని, నిబంధనలు ఉల్లంఘిస్తే తల్లిదండ్రులపై చర్యలు ఉంటాయని తెలిపారు. జాతీయ రహదారులపై వేగ పరిమితులను పాటించాలని సూచించారు. ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు మాట్లాడుతూ, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారులో ప్రయాణించే వారు సీట్‌బెల్ట్ తప్పనిసరిగా వినియోగించాలని చెప్పారు. చిన్న జాగ్రత్తలే ప్రాణాలను కాపాడతాయని తెలిపారు. డీసీపీ ఏ. భాస్కర్ మాట్లాడుతూ, రహదారులు మెరుగ్గా ఉన్నప్పటికీ ప్రమాదాలు పెరగడం ఆందోళనకరమని, క్రమశిక్షణ లోపమే ప్రధాన కారణమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ప్రమాద రహిత గ్రామాల నిర్మాణం కోసం గ్రామ స్థాయిలో రహదారి భద్రత కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించి కంటి అద్దాలు పంపిణీ చేశారు. రోడ్డు ప్రమాదాల్లో బాధిత కుటుంబాలు తమ అనుభవాలను పంచుకుంటూ నిబంధనలు పాటించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



# బీటలు వారిన అమెరికా ఆధిపత్యం!


చరిత్రలో కొన్ని సందర్భాలు సాధారణంగానే అనిపిస్తాయిగానీ సంవత్సరాలు గడిచేకొద్దీ వాటి ప్రాధాన్యం అర్థమవుతుంది. అటువంటి ఒక గొప్ప సందర్భమే ఇరాన్-అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధం. 40 రోజులపాటు కొనసాగి.. ప్రస్తుతం రెండు వారాల కాల్పుల విరమణ, రెండు రోజుల విఫల చర్చల దశలో ఉన్న ఈ యుద్ధం రెండు కొత్త పరిణామాలను మన ముందుకు తీసుకొచ్చింది. ఒకటి, ప్రపంచశక్తిగా అమెరికా ఆధిపత్యం గణనీయంగా తగ్గిపోవటం. రెండు, పశ్చిమాసియాలో ఇరాన్ ఒక ప్రాంతీయశక్తిగా ఆవిర్భవించటం. ఈ రెండింటికి తోడు మరికొన్ని ఉప పరిణామాలు ఏమిటంటే.. ఇన్నాళ్లూ అమెరికా అండ చూసుకొని పశ్చిమాసియాలో లెక్కలేనన్ని దురాగతాలకు, గాజాలో ఏకంగా నరమేధానికి పాల్పడిన ఇజ్రాయెల్ ఇకపై తన హద్దుల్లో తాను ఉండాల్సిన పరిస్థితిలోకి నెట్టివేయబడటం, నాటో కూటమి భవిష్యత్తుపై నీలినీడలు కమ్ముకోవటం, అంతర్జాతీయ రాజకీయాల్లో పాకిస్థాన్ ప్రాధాన్యం పెరగటం.డొనాల్డ్ ట్రంప్ వంటి ఒక చంచల స్వభావి, అహంకారి, అజ్ఞాని రెండోసారి అమెరికా అధ్యక్ష పదవిని చేపట్టి ఆ దేశానికి ఏ అమెరికా ప్రెసిడెంటూ చేయనంత నష్టం చేశాడు. గత కొన్ని దశాబ్దాలుగా అమెరికా పెంచిపోషించుకున్న 'ప్రపంచ సామ్రాజ్యవాద దేశం', 'ప్రపంచ పోలీసు' హోదాలకు ట్రంప్ తూట్లు పొడిచాడు. ఇది అమెరికాకు నష్టంగానీ.. ప్రపంచ దేశాలకు మంచి పరిణామమే. 1979లో ఇరాన్‌లో ఇస్లామిక్ విప్లవం తర్వాత.. తన చమురు సంపదసహా అన్ని వనరుల్నీ జాతీయం చేసింది ఆ దేశ ప్రభుత్వం. మిగిలిన గల్ఫ్ దేశాలు అమెరికా కంపెనీలకు గణనీయమైన వాటాలు ఇచ్చి తమ నిరంకుశ రాచరికాల్ని కాపాడుకున్నాయి. దీంతో ఇరాన్ మీద కక్షగట్టిన అమెరికా.. గత 47 ఏళ్లుగా ఆ దేశం మీద ఆంక్షలు విధిస్తూ వస్తోంది. గల్ఫ్ దేశాల్లో సైనిక స్థావరాలను నెలకొల్పి, ఆ దేశాల చమురు విక్రయాలు తమ డాలర్లలో జరిగేలా చూస్తూ, మరోవైపు, ఇజ్రాయెల్‌ను ఆయుధాలతో, టెక్నాలజీతో పెంచి పోషిస్తూ.. మొత్తంగా, పశ్చిమాసియాను అమెరికా తన గుప్పిట నిలుపుకుంది. అమెరికా అధ్యక్షులందరూ ఇదే విధానాన్ని అనుసరిస్తూ వచ్చారు కానీ, ఏ అధ్యక్షుడూ ఈ ఐదు దశాబ్దాల్లో ఇరాన్ మీద యుద్ధానికి దిగలేదు. యుద్ధం చేసి దానిని లొంగదీసుకోలేమన్న స్పష్టత వారికి ఉంది. కానీ, ట్రంప్ అమెరికా ప్రయోజనాలు పణంగా పెట్టి యుద్ధానికి దిగాడు. దీని వెనకాల కొన్ని కారణాలున్నాయి. ఒకటి, ఇన్నాళ్లూ ఏ అమెరికా అధ్యక్షుడికీ సాధ్యం కాని పని తాను చేశానని, ఇరాన్‌ను లొంగదీసుకున్నానని చెప్పుకోవాలనే దుగ్ధ. రెండు.. యూదుజాతి అహంకారి అయిన ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ప్రభావం. అమెరికాలో మీడియా సహా పలు కీలక రంగాలు యూదుల చేతుల్లో ఉన్నాయి. రాజకీయ పార్టీల మీద వారి ప్రభావం అపారం. అంతేగాక, తాజాగా బయటపడిన ఎప్‌స్టీన్ ఫైల్స్ ఈ యూదు లాబీ చేతుల్లో ఉన్నాయని, వీటితో బెదిరించి ట్రంప్‌ను ఇరాన్ మీద యుద్ధానికి నెతన్యాహు లాగాడన్న ఆరోపణలున్నాయి. పశ్చిమాసియాలో తన దురాగతాలకు అడ్డు నిలుస్తున్న ఏకైక దేశం ఇరాన్‌ను గాజాలాగా సర్వనాశనం చేయాలనేది నెతన్యాహు కోరిక. ఇజ్రాయెల్‌లో అవినీతికి సంబంధించి కేసులు ఎదుర్కొంటున్న నెతన్యాహుకు నిరంతర యుద్ధం అవసరం. వెనెజువెలా అధ్యక్షుడు మదురోను కిడ్నాప్ చేసి ఆ దేశాన్ని లొంగదీసుకున్నట్లుగా.. ఇరాన్ సర్వోన్నత నాయకుడు ఖమేనీని హత్య చేసి ఆ దేశాన్ని అదుపులోకి తీసుకోవాలని ట్రంప్ భావించారు. కానీ, ఆ అంచనాలన్నీ తలకిందులయ్యాయి. ఇరాన్.. దెబ్బకు దెబ్బ తీసింది. అమెరికా, ఇజ్రాయెల్‌లకు ముచ్చెమటలు పట్టించింది. గల్ఫ్‌లో ఏళ్లుగా అమెరికా నిర్మించుకున్న సైనిక స్థావరాల్ని నేలమట్టం చేసింది. అనేక యుద్ధవిమానాల్ని నేలకూల్చింది. అమెరికా యుద్ధనౌకలు ఇరాన్ దాడులకు తోకముడిచాయి. డ్రోన్లతో, క్షిపణులతో ఇజ్రాయెల్‌ను దెబ్బతీసింది ఇరాన్. ఈ దాడుల తీవ్రత గురించి మిగతా ప్రపంచానికి తెలియనివ్వకుండా ఇజ్రాయెల్, గల్ఫ్ దేశాలు మీడియా మీద ఆంక్షలు విధించి.. నష్టాలు బయటపడకుండా చూశాయి. 47 ఏళ్లుగా దుర్మార్గమైన ఆంక్షలను ఎదుర్కొంటూ కూడా రెండు అణ్వాయుధ దేశాలను ఇరాన్ ఎదుర్కొంటున్న తీరు, వికేంద్రీకరణ సూత్రంగా అమలుచేస్తున్న యుద్ధతంత్రం ప్రపంచ మిలిటరీ సైన్స్ నిపుణుల ప్రశంసలు అందుకుంది. ఇరాన్‌ను లొంగదీసుకోలేని నిస్పృహతో, అవమానంతో.. ఆ దేశంలోని స్కూళ్లను, యూనివర్సిటీలను, పరిశోధన సంస్థలను, ఆస్పత్రులను, మార్కెట్లను, బ్రిడ్జిలను, ఇళ్లను, అపార్ట్‌మెంట్లను సైతం ధ్వంసం చేసింది ట్రంప్, నెతన్యాహు ద్వయం. మొత్తానికి, ట్రంప్‌నకు విషయం అర్థమై.. ఎలాగోలా ఈ యుద్ధం నుంచి బయటపడుదామని భావించారు. సంధికి రావాలని పలుమార్లు 'హెచ్చరికలు' జారీ చేసినా కూడా ఇరాన్ ముందుకు రాలేదు. లెబనాన్‌కూ కాల్పుల విరమణ వర్తింపు అన్న డిమాండ్‌తో పాటు తన 10 షరతులు అంగీకరిస్తేనే వస్తామని స్పష్టం చేయటంతో.. ట్రంప్ వాటికి అంగీకరించి.. రెండు వారాల కాల్పుల విరమణ ప్రకటన చేశారు. ఇస్లామాబాద్ వేదికగా చర్చలు జరుగుతున్న సమయంలో.. హొర్ముజ్ జలసంధి ద్వారా రెండు అమెరికా యుద్ధనౌకలను పంపించే ప్రయత్నం చేశారు. అది విజయవంతమై ఉంటే, మీడియా ప్రచారంతో దాన్నే పెద్ద విజయంగా (ఇంతకుముందు పైలట్‌ను రక్షించుకున్న ఆపరేషన్‌లాగా) చెప్పుకునేవారేమో. కానీ, అదీ సాధ్యపడలేదు. ఇరాన్ నౌకాదళం హెచ్చరికలతో ఆ యుద్ధనౌకలు పారిపోయాయి. యుద్ధానికి ముందు లాగా.. ఇరాన్ మీద షరతులు పెట్టబోతే ఆ దేశం అంగీకరించలేదు. చర్చలు విఫలమయ్యాయి. మరోసారి చర్చలు జరుగుతాయా? ట్రంప్ ఈ యుద్ధాన్ని విరమిస్తారా? కొనసాగిస్తారా? అన్నది ప్రస్తుతానికి తెలియదు. కానీ, ఇప్పటి వరకు జరిగిన ఈ యుద్ధం వల్ల తేలిందేమిటంటే.. పశ్చిమాసియాలో ఇకపై అమెరికా, ఇజ్రాయెల్ ఏకపక్ష ఆధిపత్యం నడవదు. తన సైనికశక్తి ద్వారా, హొర్ముజ్ జలసంధిపై పట్టు ద్వారా ఇరాన్ ఈ ప్రాంతంలో ఓ కొత్త శక్తిగా ఆవిర్భవించింది. గల్ఫ్ దేశాలు ఇక మీదట కూడా అమెరికా అడుగులకు మడుగులొత్తుతాయా? లేక.. ఇరాన్‌తో జతకట్టి తమ ప్రాంతాన్ని తామే తీర్చిదిద్దుకుంటాయా అన్నది వేచి చూడాల్సిన విషయం. ఇరాన్‌లాగా గల్ఫ్ దేశాలు కూడా చమురు విక్రయాలను డాలర్లలో కాకుండా ఇతర కరెన్సీల్లో నిర్వహిస్తే.. అమెరికా డాలర్ ఆధిపత్యం కొన్నేళ్లలోనే కూలిపోతుంది. ట్రంప్ పోకడలతో, దుర్భాషలతో నాటో ఇంతకుముందులా.. అమెరికా పెత్తనాన్ని అంగీకరిస్తుందా? అన్నది చూడాల్సి ఉంది. ప్రపంచాన్నే కలవరపరిచిన ఈ యుద్ధంలో మధ్యవర్తిగా ఉండి, కీలకమైన దశలో ఇరుపక్షాలనూ కాల్పుల విరమణకు అంగీకరింపజేసిన ఘనతను పాకిస్థాన్ సొంతం చేసుకుంది. వాస్తవానికి, ఇరాన్‌తో భారత్‌కు ఉన్న వేల ఏళ్ల అనుబంధం, కొన్ని దశాబ్దాల దౌత్య సంబంధాల నేపథ్యంలో.. మనం యుద్ధవిరమణకు చొరవ చూపి ఉండాల్సింది. కానీ, ప్రధాని మోదీ ఇటీవలి ఇజ్రాయెల్ పర్యటనతో.. మన దేశానికి ఏ మాత్రం సంబంధం లేని ఈ యుద్ధంలో ఇజ్రాయెల్, అమెరికా పక్షం తీసుకున్న సంకేతాలు వెళ్లాయి.

# ఖానాపూర్ మున్సిపాలిటీలో బీజేపీ విజయం

**- రాజకీయ మార్పుకు సంకేతం - డబుల్ ఇంజిన్ సర్కార్‌కు ప్రజల మద్దతు**

**- డీలిమిటేషన్‌పై అపోహలు సృష్టిస్తున్నారంటూ విమర్శలు - నూతన చైర్‌పర్సన్‌కు శుభాకాంక్షలు - బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు**






**ఖానాపూర్, ఏప్రిల్ 13 :**
ఖానాపూర్ మున్సిపాలిటీలో భారతీయ జనతా పార్టీ సాధించిన విజయాన్ని తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు కీలక రాజకీయ మార్పుకు నిదర్శనంగా అభివర్ణించారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి దిశగా రాష్ట్రం ముందుకు సాగాలని ప్రజలు కోరుకుంటున్నారని పేర్కొన్నారు. తెలంగాణలో డబుల్ ఇంజిన్ సర్కార్ ఏర్పాటు పట్ల ప్రజల్లో స్పష్టమైన ఆసక్తి కనిపిస్తున్నదని ఆయన అన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాల వైఫల్యాలను గమనించిన ప్రజలు ప్రత్యామ్నాయంగా బీజేపీ వైపు మొగ్గు చూపుతున్నారని తెలిపారు.

ఈ విజయం భవిష్యత్తు రాజకీయాలకు మార్గదర్శకంగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. డీలిమిటేషన్ అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజల్లో అపోహలు, భయాలు సృష్టిస్తున్నారని రామచంద్రరావు విమర్శించారు. ఈ అంశంపై స్పష్టత ఇవ్వకుండా ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం జరుగుతోందని అన్నారు. ప్రజలకు నిజాలు తెలియజేయడం తమ బాధ్యతగా పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీపై కూడా ఆయన తీవ్ర విమర్శలు గుప్పించారు. మహిళా రిజర్వేషన్ బిల్లును తీసుకురావడంలో విఫలమైందని, షాబానో కేసులో సుప్రీంకోర్టు తీర్పును విస్మరించిందని పేర్కొన్నారు. మహిళా సాధికారత పట్ల కాంగ్రెస్ చిత్తశుద్ధి లేదని ఆయన ఆరోపించారు. తెలంగాణలో భవిష్యత్ బీజేపీదేనని పూర్తి విశ్వాసంతో రామచంద్రరావు తెలిపారు. ప్రజల మద్దతుతో పార్టీ మరింత బలపడుతుందని, రాబోయే ఎన్నికల్లో స్పష్టమైన ఫలితాలు కనిపిస్తాయని అన్నారు. రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులు వేగంగా మారుతున్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఖానాపూర్ మున్సిపాలిటీ నూతన చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టిన అంకం మౌనికకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యుడు గోడం నగేష్, ఎమ్మెల్యేలు ఏలేటి మహేశ్వర్ రెడ్డి, పాయల్ శంకర్, జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

# రైతుల సమస్యలపై హరీష్ రావు ఆగ్రహం

**- కొనుగోలు కేంద్రాలు వెంటనే ప్రారంభించాలి**

**- శనగలు, మక్కలు, జొన్నల కొనుగోళ్లు నిలిచిపోయాయని విమర్శలు**

**- మద్దతు ధర లేక రైతులు తీవ్ర నష్టాల్లో**

**- ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్**



**సంగారెడ్డి, ఏప్రిల్ 13**
సంగారెడ్డి జిల్లాలోని సదాశివపేట కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన మాజీ మంత్రి టి హరీష్ రావు రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. రైతుల కష్టాలను పట్టించుకోకుండా కొనుగోళ్లు నిలిపివేయడం అన్యాయమని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. శనగలు, మక్కలు, జొన్నల కొనుగోళ్లు కోటా పేరుతో నిలిపివేశారని హరీష్ రావు ఆరోపించారు. కొనుగోలు కేంద్రాలు లేక రైతులు దళారుల పాలవుతున్నారని తెలిపారు. శనగలపై ఎకరానికి సుమారు రూ.10 వేల నష్టం వస్తోందని పేర్కొన్నారు. రైతులకు కనీస మద్దతు ధర కూడా లభించడం లేదని ఆయన అన్నారు. మక్కజొన్నకు మద్దతు ధర రూ.2400 ఉన్నప్పటికీ రైతులు రూ.1600--1700కే అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఇంకా పెద్ద మొత్తంలో శనగలు రైతుల వద్దనే ఉన్నాయని, వెంటనే రూ.5870 మద్దతు ధరతో కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఆలస్యం అయితే రైతులు మరింత నష్టపోతారని హెచ్చరించారు. జొన్నల కొనుగోలుపై ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని విమర్శించారు. రైతులు తమ పంటలను పక్క రాష్ట్రాలకు తీసుకెళ్లి తక్కువ ధరకు అమ్ముకునే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. వడ్ల కొనుగోళ్లు కూడా నిలిచిపోయాయని అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన బోనస్ హామీలను ప్రభుత్వం నిలబెట్టుకోలేదని హరీష్ రావు విమర్శించారు. వెంటనే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి, బోనస్ చెల్లింపులు చేయాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కోరారు.

# ఖైరతాబాద్‌లో "అరైవ్-అలైవ్" పోస్టర్ విడుదల

**- రోడ్డు భద్రతపై ప్రత్యేక చర్యలు - రాష్ట్రవ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు ప్రారంభం**

**- గోల్డెన్ అవర్ సేవలకు 'రహవీర్ అవార్డ్' - ట్రాఫిక్ నియమాల అమలుపై కట్టుదిట్ట చర్యలు**



**హైదరాబాద్, ఏప్రిల్ 13**
ఖైరతాబాద్‌లోని రవాణా శాఖ కార్యాలయంలో ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా "అరైవ్--అలైవ్" రోడ్ సేఫ్టీ కార్యక్రమ పోస్టర్‌ను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విడుదల చేశారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఏప్రిల్ 13 నుండి 18 వరకు రాష్ట్రవ్యాప్తంగా పోలీస్ మరియు రవాణా శాఖల సమన్వయంతో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచడం, ప్రమాదాలను తగ్గించడం, ప్రాణ నష్టం నివారించడం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రమాద సమయంలో గోల్డెన్ అవర్‌లో బాధితులను ఆసుపత్రికి చేర్చిన వారికి "రహవీర్ అవార్డ్" అందజేస్తామని మంత్రి తెలిపారు. సమయానికి వైద్య సహాయం అందితే ప్రాణాలను కాపాడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని చెప్పారు. పర్యావరణ పరిరక్షణతో పాటు ట్రాఫిక్ నియమాల కఠిన అమలుపై దృష్టి సారిస్తున్నామని మంత్రి వెల్లడించారు. ప్రతి జిల్లాలో సమీక్షలు నిర్వహిస్తూ, విద్యార్థులకు రోడ్డు భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. అలాగే 30 ఏళ్ల సేవలో ప్రమాదాలు చేయని ఆర్టీసీ సిబ్బందిని సన్మానించే నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఆర్టీసీ అంశంపై మంత్రి మాట్లాడుతూ, ప్రభుత్వంలో విలీనం అంశం కమిటీ పరిధిలో ఉందని స్పష్టం చేశారు. సిబ్బంది సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ప్రేరేపిత సమ్మెలకు వెళ్లవద్దని సూచించారు. పెండింగ్ డీఏ ఇచ్చామని, పీఆర్‌సీపై పరిశీలన కొనసాగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్, రవాణా శాఖ కమిషనర్ ఇళంబర్తి, ఆర్టీసీ ఎండీ నాగి రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ఇలాంటి కార్యక్రమాలు కొనసాగుతాయని అధికారులు తెలిపారు.



# దుద్దిళ్ల శ్రీపాదరావుకు నివాళి

**- సీఎం రేవంత్ రెడ్డి పుష్పాంజలి**

**- జూబ్లీహిల్స్ నివాసంలో నివాళులు**

**- శాసనసభకు వన్నె తెచ్చిన నాయకుడని కొనియాడిన సీఎం**

**- నేటి తరానికి స్ఫూర్తి అని వ్యాఖ్యలు**



**హైదరాబాద్, ఏప్రిల్ 13**
ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు 27వ వర్ధంతి సందర్భంగా జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను స్మరించుకున్నారు. శ్రీపాదరావు తెలుగు రాష్ట్రాల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు పొందిన నాయకుడని సీఎం పేర్కొన్నారు. సర్పంచ్ స్థాయి నుంచి శాసనసభ స్పీకర్ వరకు అనేక పదవులను నిర్వహించి ప్రజాసేవలో తన ముద్ర వేశారని కొనియాడారు. శాసనసభ ఔన్నత్యాన్ని పెంపొందిస్తూ సభను హుందాగా నడిపిన తీరు ఎంతో శ్లాఘనీయమని సీఎం అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఆయన పాత్ర కీలకమని వివరించారు. నాయకత్వంలో ఆయన చూపిన విలువలు ఆదర్శప్రాయమని తెలిపారు.
శ్రీపాదరావు జీవితం నేటి తరానికి గొప్ప స్ఫూర్తి అని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. ప్రజాసేవలో నిబద్ధతతో పనిచేసిన ఆయనను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ వేమ్ నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ తదితరులు పాల్గొన్నారు. నాయకులు కలిసి ఆయనకు ఘన నివాళులు అర్పించారు. శ్రీపాదరావు సేవలను గుర్తుచేసుకుంటూ ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని నాయకులు పిలుపునిచ్చారు. ప్రజాసేవలో ఆయన చూపిన మార్గం అందరికీ ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు.

## ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధికి సీఎం హామీ

**- ఆదివాసీల సంక్షేమంపై దృష్టి**

**- మౌలిక వసతుల సమస్యల పరిష్కారం**

**- చెక్‌డ్యాంలు, ఇళ్ల కోటా పెంపు పరిశీలన**



**హైదరాబాద్, ఏప్రిల్ 13**
ఆదివాసీ, గిరిజన, ఏజెన్సీ ప్రాంతాల సమగ్రాభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని తెలంగాణ ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఆ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు అడ్డంకిగా ఉన్న సమస్యలను ప్రత్యేకంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.మంత్రి దానసరి అనసూయ (సీతక్క) నేతృత్వంలో ఆదివాసీ, గిరిజన ఎమ్మెల్యేల బృందం జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రిని కలిసి ఏజెన్సీ ప్రాంతాల సమస్యలపై వినతిపత్రం సమర్పించింది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, గిరిజనుల సంక్షేమం ప్రభుత్వానికి ప్రాధాన్య అంశమని పేర్కొన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో చెక్‌డ్యాంల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. వీటి ద్వారా తాగునీరు, సాగునీటి అవసరాలు తీరేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అలాగే చెక్‌డ్యాంలు, రహదారుల నిర్మాణానికి అటవీ శాఖ అనుమతులు త్వరగా వచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గిరిజన రైతులు సాగు చేస్తున్న భూముల్లో బోర్లు వేసేందుకు అనుమతులు ఇవ్వాలన్న విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించారు. రహదారుల నిర్మాణం, మరమ్మత్తులకు అటవీ శాఖ నుంచి వస్తున్న అడ్డంకులను తొలగించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.అదేవిధంగా ఏజెన్సీ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్ల కోటా పెంపు విషయాన్ని పరిశీలిస్తామని సీఎం పేర్కొన్నారు. ఐటీడీఏలను మరింత బలోపేతం చేసి గిరిజనులకు అన్ని విధాలుగా సహాయం అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ సమావేశంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వేద్మా బొజ్జు, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్, రాజ్యసభ సభ్యుడు వేమ నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నటి త్రిష ఇంటికి బాంబు బెదిరింపు

**చెన్నై, ఏప్రిల్ 13**



ప్రముఖ నటి త్రిష ఇంటికి బాంబు బెదిరింపు వచ్చింది. చెన్నై తేనాంపేటలోని ఆమె నివాసంలో బాంబు పెట్టినట్టు సోమవారం ఉదయం 9.30 గంటల ప్రాంతంలో డీజీపీ కార్యాలయ కంట్రోల్ రూమ్‌కు ఈమెయిల్ వచ్చింది. దీంతో పోలీసులు బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో వెళ్లి త్రిష ఇల్లంతా జల్లెడ పట్టారు. తనిఖీలో ఎలాంటి పేలుడు పదార్థాలు లభించలేదు.



## ఆకాశానికి కలల నిచ్చెన

కెరీర్ ఆరంభం నుంచి వైవిధ్యమైన కథల్ని ఎంచుకుంటూ ప్రేక్షకుల్ని అలరిస్తుంటారు మలయాళ అగ్ర హీరో దుల్కర్ సల్మాన్. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న మరో వినూత్న కథా చిత్రం 'ఆకాశంలో ఒక తార'. పవన్? సాధినేని దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని గీతా ఆర్ట్స్, స్వప్న సినిమాస్ సమర్పిస్తున్నాయి. ఇప్పటికే విడుదలైన ఫస్ట్‌లుక్, టీజర్ సినిమాపై ఆసక్తిని పెంచాయి. ఈ చిత్రం ద్వారా సాత్విక వీరవల్లి కథానాయికగా పరిచయమవుతున్నది. సోమవారం ఆమె ఫస్ట్?లుక్‌తో పాటు క్యారెక్టర్ టీజర్?ను విడుదల చేశారు. ఓ పల్లెటూరి అమ్మాయి ఆకాంక్షలకు అద్దం పట్టే కథ ఇదని టీజర్?ను చూస్తే అర్థమవుతున్నది. 'రోడ్డు కూడా సరిగ్గా లేని ఈ ఊరు నుంచి ఆకాశానికి నిచ్చెన వేశావా? ఈ ఊరు పొలిమేర దాటి చూపించు చూద్దాం..' అంటూ కథానాయికను సవాలు చేస్తూ ఓ వ్యక్తి చెప్పిన డైలాగ్ కథ తాలూకు భావోద్వేగాలను ఆవిష్కరించేలా ఉంది. జీవీ ప్రకాష్ కుమార్ బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ ఆకట్టుకుంది. ఇప్పటివరకు 30శాతం చిత్రీకరణ పూర్తయిందని, వేసవిలో పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేస్తామని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి రచన: గంగరాజు గుణ్ణం, నిర్మాతలు: సందీప్ గుణ్ణం, రమ్య గుణ్ణం, దర్శకత్వం: పవన్ సాధినేని.



## వాళ్లను విడిచి ఉండలేకపోయా!

శ్రీలీల అనగానే డాక్టర్.. యాక్టర్.. డ్యాన్సర్ అని మాత్రమే చాలామంది అనుకుంటారు. కానీ తనలో గొప్ప మానవతామూర్తి దాగున్నదని చాలామందికి తెలియదు. 24ఏండ్ల ప్రాయంలోనే ముగ్గురు పిల్లలను దత్తత తీసుకుని సాటి తారలకు ఆదర్శంగా నిలిచింది శ్రీలీల. తెరపై స్టార్ హీరోయిన్‌గా అలరిస్తూనే, తెర వెనుక బాధ్యతగల పౌరురాలిగా ప్రత్యేకతను చాటుకుంటున్న శ్రీలీల.. ఇటీవల తన దత్తత విషయంపై మాట్లాడింది. 'అమ్మతనంలోని మాధుర్యాన్ని అమ్మను కాకుండానే అనుభవించడం గమ్మత్తుగా ఉంది. 2019లో 'కిస్' అనే కన్నడ సినిమా చేశాను. ఆ సినిమా షూటింగ్ ఒక ఆశ్రమంలో జరిగింది. ఆ టైమ్‌లో ఆ పిల్లలతో ఏర్పడిన అనుబంధమే దత్తతకు దారి తీసింది. ఎందుకో తెలియదు షూటింగ్ తర్వాత ఆ పిల్లల్ని విడిచి వెళ్లలేకపోయాను. వారి జ్ఞాపకాలు కొన్ని రోజులు వెంటాడాయి. 2022లో ఆ దివ్యాంగ పిల్లలను దత్తత తీసుకున్నా. ఈ విషయాన్ని రహస్యంగా ఉంచాలనుకున్నప్పటికీ.. మరికొంతమందికి ఇది ప్రేరణగా నిలుస్తుందనే ఉద్దేశంతో బయటకు చెప్పాను. నిజానికి ఈ విషయం గురించి మాట్లాడేటప్పుడు నాకు మాటలు రావు. అప్రయత్నంగా నా గొంతు వణుకుతుంటుంది.



## స్విమ్మింగ్ షూట్ కోసం నీళ్లలోనే ఉండిపోయా

సినీ ప్రియులకు పెద్ద పండగ సంక్రాంతి ఈ యేడాది 'ది రాజాసాబ్'తో మొదలుకానుంది. మారుతి దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా తెరకెక్కిన ఈ సినిమా సంక్రాంతి కానుకగా జనవరి 9న విడుదల కానుంది. ఇప్పటికే పాటలు, ప్రచార చిత్రాలు ఆసక్తిని రెట్టింపు చేయగా తాజాగా మాళవికా మోహనన్ కొన్ని విషయాలు పంచుకున్నారు. 'నటీనటుల మధ్య సన్నివేశాలు బాగా రావాలంటే కెమిస్ట్రీ ముఖ్యం. ఈ చిత్రంలో ప్రభాస్‌కు, నాకు మధ్య చాలా సన్నివేశాలు ఉన్నాయి. ఇందులో నాది నిడివి ఎక్కువ ఉన్న పాత్ర. నా సోలో సీన్ ఒకదాన్ని మూడు రోజులు పెద్ద స్విమ్మింగ్‌పూల్‌లో షూట్ చేశారు. ఆ మూడు రోజులు దాదాపు రోజుకు 10 గంటలు నీళ్లలోనే ఉండాల్సి వచ్చింది. నామీద మొసలి దాడి చేస్తున్నట్లు నటించాల్సిన సీన్. ఒకవైపు చలికి చర్మం మొత్తం మొద్దుబారిపోతున్న ఫీలింగ్ కలిగేది. అదే సమయంలో మొసలి దాడి చేస్తున్నట్లు ఎక్స్‌ప్రెషన్స్ పెట్టాలన్నారు. ఆ నీళ్లు కూడా దారుణంగా ఉన్నాయి. అందరూ అందులోకి దిగి షూట్ చేస్తున్నారు. పెయింట్, కెమికల్స్, వాడిపారేసిన వస్తువులు అన్నీ అందులో ఉన్నాయి.

## ఎప్పటికైనా నిజం తెలుస్తుంది!

ప్రేక్షకులకు వినోదాన్ని అందించడమే కథానాయికగా తన లక్ష్యమని, భాషాపరమైన హద్దులు లేకుండా వైవిధ్యమైన చిత్రాలను ఎంచుకుంటున్నానని చెప్పింది అగ్ర కథానాయిక రష్మిక మందన్న. గతేడాది ఈ భామ ఖాతాలో ఛావా, థామా, ది గర్ల్?ఫ్రెండ్? వంటి భారీ విజయాలున్నాయి. ఈ నేపథ్యంలో రెట్టించిన ఉత్సాహంతో కొత్త సినిమాలపై దృష్టిపెడుతున్నది. తాజాగా అభిమానులతో జరిపిన చిట్?చాట్?లో కెరీర్?కు సంబంధించిన ఆసక్తికరమైన విషయాలను వెల్లడించింది రష్మిక మందన్న. 'ప్రేక్షకుల అభిరుచులకు అనుగుణంగా ప్రేమకథలతో పాటు కమర్షియల్? చిత్రాలు, లేడీ ఓరియెంటెడ్? సబ్జెక్ట్స్?.. ఇలా సినిమాల ఎంపికలో వైవిధ్యాన్ని ప్రదర్శిస్తున్నా' అని ఆమె చెప్పింది. సోషల్?మీడియా ట్రోల్స్? గురించి స్పందిస్తూ 'సినీ సెలబ్రిటీలపై నెగెటివ్? న్యూస్? రావడం సాధారణమే. అలాంటి వార్తల ద్వారా ఎంతో మంది ఉపాధి పొందుతున్నారు. వాళ్లు కూడా బతకాలని వదిలేస్తా. అయితే ఎన్ని దుష్ప్రచారాలు చేసినా, ఏదో ఒకరోజు మాత్రం నిజం తెలుస్తుందని నా నమ్మకం. అందుకే ఒకప్పుడు రూమర్స్? విన్నప్పుడే బాధగా అనిపించేది. కానీ ఇప్పుడు వాటిని ఎలా కౌంటర్? చేయాలో తెలుసుకున్నా' అని వివరించింది రష్మిక మందన్న. ప్రస్తుతం ఆమె తెలుగులో 'మైసా', హిందీలో 'కాక్? టెయిల్?-2' చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంది.

